# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | సోమవారం 11 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




సమస్యను ఎస్సై రామకృష్ణకు వివరిస్తున్న సుధాకర్, అతని భార్య శారద, (ఇన్‌సెట్లో పెట్రోల్ బాటిల్‌తో సుధాకర్)

# ప్లాట్ ఇప్పిస్తానని కాంగ్రెస్ నేత మోసం

## పెట్రోల్ బాటిల్‌తో దంపతుల ఆత్మహత్యాయత్నం

ములుగు, మార్చి10(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, మంత్రి సీతక్క అనుచరుడు బానోత్ రవిచందర్ ప్లాట్ ఇప్పిస్తానని మోసం చేశాడని దంపతులు ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు నిగ్గుల సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో ములుగు జిల్లా కేంద్రంలోని సమ్మయ్యనగర్ కాలనీలో రియల్ ఎస్టేట్ వ్యాపారి బానోత్ సమ్మయ్య ప్లాట్లు చేశాడని, అందులో ఒక ప్లాట్ ఇప్పిస్తానని రూ. లక్షా80వేలు తీసుకొని కాగితం కూడా రాసి ఇచ్చాడు. అప్పటి నుంచి మాయమాటలు చెబుతూ 9 ఏళ్ల పాటు తిప్పించుకోవడమే కాకుండా సీతక్క తాను కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని చెప్పి, ఆ ప్లాట్‌ను ఎక్కువ రేటుకు విక్రయించి చింతలపల్లిలో భూమి కొనుగోలు చేసి కోట్లు సంపాదించాడు. ఆ తర్వాత ప్లాట్‌కు బదులుగా భూమి ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదు. దీంతో చేసేదేమీ లేక తన భార్య శారదతో కలిసి నిగ్గుల సుధాకర్ గ్రామంలోని తమ ఇంట్లో ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోల్ బాటిల్ పట్టుకుని తలుపులు మూసుకున్నారు. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై-2 రామకృష్ణ అక్కడికి వెళ్లి కిటికీలో నుంచి సుధాకర్‌ను సముదాయించే ప్రయత్నం చేయగా రవిచందర్ మంత్రి సీతక్క పేరు చెప్పి భూమి విషయంలో తనను మోసం చేశాడని చెప్పాడు. తమ సమస్య సీతక్క దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే వరకు తాము ఇంట్లో నుంచి బయటకు రామని, లేదంటే నిప్పంటించుకొని చనిపోతామని ఎస్సైకి తేల్చి చెప్పారు. దీంతో ఎస్సై మంత్రి సీతక్క అధికారిక కార్యక్రమంలో బిజీగా ఉన్నారని తెలిపి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. స్పందించిన అశోక్ సుధాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని, ఆత్మహత్య లాంటివి ఏమి చేయవద్దని చెప్పాడు. అశోక్ హామీతో సుధాకర్, అతని భార్య శారద ఆత్మహత్యా యత్నాన్ని విరమించుకొని ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. కాగా, ఎస్సై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సొంత గ్రామానికి చెందిన తననే ఈ విధంగా మోసం చేసిన రవిచందర్ ఇంకా చాలా మందిని మోసం చేసి ఉంటాడని, తన చావుతోనైనా అతడి నిజస్వరూపం బయటకు వస్తుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



36వ డివిజన్‌లో వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం, నర్సంపేట రోడ్డులో ఎంట్రన్స్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క

### హోదా మరిచిన కాంగ్రెస్ నాయకులు

మంత్రి పొంగులేటి పర్యటనలో కాంగ్రెస్ నాయకులు క్రమశిక్షణ, ప్రొటోకాల్ మరిచి ఇష్టారీతిన ప్రవర్తించారు. అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేసిన తర్వాత హాజరైన వరంగల్‌లో సభావేదికపై ఏ హోదా లేని కాంగ్రెస్ నాయకులు కనిపించడంపై పలువురు కార్పొరేటర్లు ఆగ్రహించారు. వారు ఏ హోదాలో వేదికపైకి వచ్చారని పలువురు కార్పొరేటర్లు సీనియర్ నాయకులకు ఫిర్యాదు చేశారు. 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునీల్ వేదికపై ఉండగానే అదే డివిజన్‌కు చెందిన మీసాల ప్రకాశ్ మైక్ తీసుకొని మాట్లాడడం, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్, ఆకుతోట శిరీష్, కరాటే ప్రభాకర్, మంతెన సునీత తదితరులు వేదికపైకి రావడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

# ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తాం

## ఆరు గ్యారెంటీల్లో మిగతావి అమలు చేస్తాం

**నేడు భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభిస్తాం**

**వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**నగరంలో కే-హబ్ సహా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన**

**పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు**

*హనుమకొండ చౌరస్తా/వరంగల్ చౌరస్తా, మార్చి 10: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్కతో కలిసి వరంగల్, హనుమకొండల్లో కే-హబ్ సహా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.*



అనధికారికంగా వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నాయకులు(వృత్తంలో)

వరంగల్ బస్టాండ్ జంక్షన్‌లో దివ్యాంగులకు స్కూటీలు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మొక్క నాటి లక్ష వృక్షార్చన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని పది ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, కాకతీయ యూనివర్సిటీలో కే-హబ్, భారతరత్న పీవీ నర్సింహారావు నాలెడ్జ్ సెంటర్, మెన్స్ హాస్టల్, సమ్మక్క, సారలమ్మ ఉమెన్స్ హాస్టల్స్, అకాడమిక్ బ్లాక్-3, ఎంబీఏ బిల్డింగ్, మెన్ డైనింగ్ హాల్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ రెండో ఫ్లోర్ ప్రారంభోత్సవాలు, ప్రహరీ, హనుమకొండ సమ్మయ్యనగర్‌లో సమగ్ర వరద నీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపనలు, బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్క్ ఆధునీకరణ పనుల శిలాఫలకాల ఆవిష్కరణ, ఎంజీఎం దవాఖాన పిల్లల వార్డులో చిన్నారుల క్రీడా సామగ్రి ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు సుమారు రూ.250 కోట్లతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రూ.68కోట్లతో 11 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. ప్రహరీ లేకపోవడం వల్లే కేయూ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వర్సిటీ భూములు కబ్జాకు గురికాకుండా సర్వే చేసి ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగింటిని ప్రభుత్వం అమలు చేసిందని, 11న భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిగతా వాటిని కొద్దిరోజుల్లోనే అమలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నగరంలో మూడేళ్లలో ఏటా లక్ష మొక్కలు నాటడమే లక్ష్యమని, దీన్ని నగరంలోని కాలనీ వాసులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కేయూ వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

### పోలీసుల అత్యుత్సాహం

మంత్రుల కార్యక్రమాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో ఓ జర్నలిస్టుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వరంగల్ బస్టాండ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాత్రమే ఉండాలని మంత్రి సురేఖ ఆదేశించారు. దీంతో కొందరిని వేదిక నుంచి పంపే క్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి.. ఓ టీవీ చానల్ ప్రతినిధిని దుర్భాషలాడుతూ తోసివేశారు. అయినప్పటికీ మంత్రులు పట్టించుకోకపోవడంపై పలు జర్నలిస్టు సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. గతంలోనూ అదే పోలీస్ అధికారి జర్నలిస్టులతో అనుచితంగా ప్రవర్తించిన విషయాన్ని పలువురు యూనియన్ నాయకులు ప్రస్తావించారు. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాగా కే-హబ్ ప్రారంభోత్సవం వద్ద పోలీసుల ప్రవర్తన చర్చనీయాంశమైంది. వారి తీరుపై ప్రొఫెసర్లతో పాటు విద్యార్థులు, జర్నలిస్టులు మండిపడ్డారు. ఒక దశలో వీసీ, రిజిస్ట్రార్‌ను సైతం పక్కకు తోసేశారు. కే-హబ్‌ను ప్రారంభించిన మంత్రులు లోపలికి వెళ్లి చూస్తుండగా డీసీపీ బారి, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి కేయూ ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకున్నారు. జర్నలిస్టులను సైతం లోపలికి పంపకపోవడంతో బయటనే ఉండాల్సి వచ్చింది. లోపలికి వెళ్లిన మంత్రులు అక్కడే మీడియాతో మాట్లాడారు. లోపలికి అనుమతించాలని మరికొందరు జర్నలిస్టులు పోలీసులను కోరినా అంగీకరించలేదు. ఇదిలా ఉండగా అసలు కే-హబ్ ఎవరు కట్టించారు..? ఇప్పుడు ఎవరు ప్రారంభిస్తున్నారు అని అక్కడ ఉన్న వారు అని చర్చించుకున్నారు.

# కన్నోళ్లే కాలయములై

## అత్యంత పాశవికంగా ముక్కుపచ్చలారని ఇద్దరు ఆడపిల్లల హత్య

**పాలల్లో పురుగు మందు కలిపి తాగించిన తల్లిదండ్రులు**

**పరారైన భార్యాభర్తలు, కుటుంబ కలహాలు, జల్సాలే కారణమంటున్న స్థానికులు**

**గార్ల మండలం అంకన్నగూడెంలో విషాదం**

*గార్ల, మార్చి 10 : ఇద్దరు ఆడపిల్లలను సాకడం భారమనుకున్నారో.. లేక తమ జల్సాలకు అడ్డొస్తున్నారని భావించారో కానీ, ముక్కు పచ్చలారని చిన్నారులను అత్యంత పాశవికంగా హత్య చేశారు తల్లిదండ్రులు. కని పెంచిన ఆ తల్లికి చేతులెలా వచ్చాయో.., అల్లారు ముద్దుగా సాకుతున్న ఆ తండ్రిని ఏం ఆవహించిదో.. కానీ, పేగుబంధాన్ని మరిచి పాలల్లో పురుగు మందు కలిపి ఇద్దరు చిన్నారులకు తాగించారు. వారు విగత జీవులుగా మారడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం గార్ల మండలం సీతంపేట గ్రామ పంచాయతీ శివారు అంకన్నగూడెంలో జరిగింది.*



లోహిత, జస్విత మృతదేహాలు



పిల్లల్ని పొట్టన పెట్టుకున్న తల్లిదండ్రులు అనిల్ కుమార్, దేవి (ఫైల్)

పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల మండలం సీతంపేట గ్రామ పంచాయతీ శివారు అంకన్నగూడెం గ్రామానికి చెందిన పెండగట్ల అనిల్ కుమార్‌కు బయ్యారం మండలం నామాలపాడు గ్రామానికి చెందిన దేవితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల లోహిత(2), 11 నెలల జస్విత ఉన్నారు. అనిల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో వారం రోజులుగా వీరు నామాలపాడులోని అత్తమామల వద్ద ఉంటున్నారు. శనివారం సాయంత్రం అంకన్నగూడెం వచ్చారు. రాత్రి భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ, ఇద్దరు చిన్నారులకు పాలల్లో పురుగు మందు కలిపి తాగించారు. దీంతో చిన్నారులు విగతజీవులయ్యారు. అనిల్‌కుమార్, దేవి అక్కడి నుంచి పారిపోయారు. అదే ఇంట్లో ఉంటున్న చిన్నారుల తాత పెండగట్ల వెంకన్న రోజూ మాదిరిగానే కిరాణా దుకాణానికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు గమనించి ఇరుగుపొరుగు వారికి తెలిపాడు. మంచం పక్కన పాల డబ్బా, పురుగుమందు డబ్బా పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ తిరుపతి, గార్ల-బయ్యారం సీఐ రవి, ఎస్సై జీనత్‌కుమార్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. వెంకన్న ఫిర్యాదుతో ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నమ్మించి.. ఉడాయించి

**ఉద్యోగాలు, తక్కువ ధరకే బంగారం పేరుతో యువకుడి మోసం**

**రూ. 53లక్షల నగదు, 61 తులాల బంగారంతో పరార్**

**పోలీసులను ఆశ్రయించిన బాధితులు**

బయ్యారం మార్చి 10: 'నేను ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నా. నాకు లక్ష రూపాయల జీతం. మీకు ఉద్యోగం ఇప్పిస్తా.. అంటూ కొందరిని, తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తా' అంటూ మరికొందరిని నమ్మించిన యువకుడు అందిన కాడికి దండుకొని ఉడాయించాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. బయ్యారం మండలంలోని చోక్లాతండాకు చెందిన యువకుడు భూక్యా వెంకటసాయి కృష్ణ కొన్నేళ్లపాటు హైదరాబాద్‌లో నివాసమున్నాడు. ఏడాది క్రితమే గ్రామానికి వచ్చి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే స్థానికులకు 'తాను ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నా.. లక్ష రూపాయల జీతం వస్తుందని... డబ్బులు ఇస్తే అలాంటి ఉద్యోగం ఇప్పిస్తానని ఒక్కొక్కరి వద్ద రూ. 2లక్షల నుంచి రూ.7 లక్షల వరకు నగదు, బంగారం తీసుకున్నాడు. మరికొందరి వద్ద తనకు ముత్తూట్ ఫైనాన్స్‌లో తెలిసిన వారు ఉన్నారని, కుదువ పెట్టిన బంగారం తక్కువ ధరకు వస్తుందని మాయమాటలు చెప్పి నమ్మించాడు. దీంతో మండలంలోని చోక్లాతండా, జగ్నితండా, పాప్లితండాతోపాటు జిల్లాలోని సాలర్‌తండా, ముడుపుగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామాలకు చెందిన 14 మంది సుమారు రూ.53 లక్షల నగదు, 61 తులాల బంగారం ఇచ్చారు. అయితే, రెండు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, తీసుకున్న బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు ఒత్తిడి తేగా, రేపు మాపు అంటూ తిప్పేవాడు. నకిలీ బ్యాంకు వోచర్లు, చెక్కులు, వాట్సాప్ మెస్సేజ్‌లతో కొన్ని రోజులు మభ్య పెట్టాడు. ఒత్తిడి ఎక్కువ కావడంతో నాలుగు రోజుల నుంచి పత్తా లేకుండా పోయాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వద్ద పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, ఆధారాలు పరిశీలించి కేసు నమోదు చేస్తామని గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ తెలిపారు.



బాదితులకు ఇచ్చిన పని చేయని చెక్కులు


